మానేరు విద్యాసంస్థల వార్షికోత్సవంలో నృత్య రూపకం ప్రదర్శిస్తున్న విద్యార్థినులు

అట్టహాసంగా మానేరు విద్యాసంస్థల వార్షికోత్సవం

కొత్తపల్లి, మార్చి 31: విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఎంపీ బండి సంజయ్‌కుమార్ ఆకాంక్షించారు. స్థానిక పద్మనగర్‌లోని మానేరు సీబీఎస్ఈ పాఠశాలలో ఆదివారం రాత్రి నిర్వహించిన మానేరు విద్యాసంస్థల వార్షికోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ, విద్యార్థులు, యువత స్వామి వివేకానందుడిని స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. 38 సంవత్సరాలుగా విద్యారంగంలో కొనసాగుతున్న మానేరు విద్యాసంస్థల యాజమాన్యాన్ని అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అలాగే, 2022-23 విద్యా సంవత్సరంలో పదో తరగతి (సీబీఎస్ఈ)లో 10 జీపీఏ సాధించిన విద్యార్థులను, తల్లిదండ్రులను సత్కరించారు. ఎంపీ బండి సంజయ్ చేతుల మీదుగా విద్యార్థులకు నగదు బహుమతులు అందజేశారు. అనంతరం వివిధ రంగాల్లో విశిష్ట సేవలందించిన పలువురికి మానేరు కీర్తి పురస్కారాలను ప్రదానం చేశారు. ఈ వేడుకల్లో మానేరు విద్యాసంస్థల అధినేత కడారి అనంతరెడ్డి, డైరెక్టర్ కడారి సునీతారెడ్డి, గండ్ర లక్ష్మణ్‌రావు, దాస్యం సేనాధిపతి, బుర్ర మధుసూదన్‌రెడ్డి, కృపాదానం, తుమ్మల రమేశ్‌రెడ్డి, గసిరెడ్డి జనార్దన్‌రెడ్డి, విద్యార్థులు, తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సైకాలజిస్టుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ పరికిపండ్ల అశోక్

విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి

మానకొండూర్ రూరల్, మార్చి 31: శ్రీనివాస్‌నగర్ కేజీబీవీలో ఆదివారం ఆరోగ్య మిత్ర స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో 'పరీక్షల్లో విజయం సాధించాలంటే' అంశంపై ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా సైకాలజిస్టుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జాతీయ అవార్డు గ్రహీత డాక్టర్ పరికిపండ్ల అశోక్ హాజరై మాట్లాడారు. విద్యార్థులు ఇష్టంతో చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. విద్యార్థులు ప్రేరణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రత్యేకాధికారి స్వప్న, ఉపాధ్యాయులు ప్రసన్న, శ్రీలత, విద్యార్థులు పాల్గొన్నారు.

వాసవీ క్లబ్ వీణవంక మండల కమిటీ

వీణవంకలో వాసవీ మాత క్లబ్‌ను ప్రారంభిస్తున్న గవర్నర్లు, కమిటీ సభ్యులు

వీణవంక, మార్చి 31: వాసవీ క్లబ్ వీణవంక మండలాధ్యక్షుడిగా మండల కేంద్రానికి చెందిన రామిడి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా అల్లెంకి రమేశ్, కోశాధికారిగా చందరవీందర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. క్లబ్ గవర్నర్ల సమక్షంలో ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కటుకం హరీశ్ మాట్లాడుతూ, ఆర్యవైశ్యులు సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ వాసవీమాత ఖ్యాతిని చాటాలని పిలుపునిచ్చారు. క్లబ్ సభ్యులు సాంబమూర్తి, రాజశేఖర్, అల్లెంకి నాగన్న, విశ్వంభర్, శ్రీనివాస్, ఆకినపెల్లి శ్రీనివాస్, శివరాం, కోటేశ్వర్, గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులకు సన్మానం

హుజూరాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులను సన్మానిస్తున్న మాదిగ మేధావుల ఫోరం సభ్యులు

హుజూరాబాద్ టౌన్, మార్చి 31: హుజూరాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా గోస్కుల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా మట్టెల తిరుపతి ఇటీవల ఎన్నికవగా, పట్టణంలో మాదిగ మేధావుల ఫోరం సభ్యులు ఆదివారం వారిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంఐఎఫ్ గౌరవాధ్యక్షుడు వేల్పుల రత్నం, అధ్యక్షుడు ఆడెపు సురేందర్, ప్రధాన కార్యదర్శి రొంటాల సుమన్, జర్నలిస్ట్ కేసరి మధుకర్‌రావు, గోస్కుల లింగయ్య, మట్టేడ ప్రకాశ్, డాక్టర్ తడికమళ్ల శేఖర్, గడప రాజు, దాట్ల ప్రభాకర్, వేల్పుల ప్రభాకర్, కనకం వెంకటస్వామి, బత్తుల రాజలింగం, బొడ్డు ఐలయ్య, ఎర్ర రాజు, మేకల మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి చిక్కాల పరామర్శ

ఇల్లంతకుంట: బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న సెస్ చైర్మన్ చిక్కాల రామారావు

ఇల్లంతకుంట, మార్చి 31: రామోజీపేట గ్రామానికి చెందిన కేశవేని శ్రీనివాస్, ఆంజనేయులు తల్లి ఇటీవల మృతి చెందగా, బాధిత కుటుంబాన్ని సెస్ చైర్మన్ చిక్కాల రామారావు ఆదివారం పరామర్శించారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ కస్తూరి తిరుపతిరెడ్డి ఉన్నారు.

సిరిసిల్ల రూరల్, మార్చి 31: తంగళ్లపల్లి మండల పరిషత్ కో ఆప్షన్ సభ్యుడు ఎండీ తాజుద్దీన్ తండ్రి ఇటీవల మృతి చెందగా, బాధిత కుటుంబాన్ని సెస్ చైర్మన్ చిక్కాల రామారావు పరామర్శించారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు గజభీంకార్ రాజన్న, నాయకులు ఉన్నారు.

ఔట్‌సోర్సింగ్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

సిరిసిల్ల రూరల్, మార్చి 31: సర్దాపూర్‌లోని 17వ పోలీస్ బెటాలియన్‌లో పలు పోస్టుల భర్తీకి (ఔట్ సోర్సింగ్) దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని కమాండెంట్ శ్రీనివాస్‌రావు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఫార్మసిస్ట్-2, బార్బర్-2, ధోబీ-3, ఆఫీస్ సబార్డినేట్ 2, పారిశుద్ధ్య కార్మికులు-3, స్వీపర్-5, హెల్త్ అసిస్టెంట్-2 పోస్టుల కోసం పురుష అభ్యర్థులు ఈ నెల 4లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

'ఉపాధి' వేతన పెంపులో కేంద్రం వివక్ష

- రూ. 28 మాత్రమే పెంచడంపై తీవ్ర అసంతృప్తి
- కేంద్రం తీరుపై మండిపాటు
- జిల్లాలో రోజురోజుకూ తగ్గుతున్న కూలీలు



ఉపాధి పనుల్లో కూలీలు

కలెక్టరేట్, మార్చి 31: ఏటా ఆర్థిక సంవత్సర చివరలో ఉపాధి కూలీలకు పెంచే వేతనంలో కేంద్రం తీవ్ర వివక్ష చూపుతున్నదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దేశవ్యాప్తంగా ఒకే విధమైన వేతన పెంపు విధానం అమలు చేయాల్సి ఉండగా, ఇష్టారాజ్యంగా వేతన పెంపు పద్ధతి అవలంబిస్తున్నదని కూలీలు విమర్శిస్తున్నారు. కొన్ని రాష్ట్రాల్లో రూ.50 నుంచి రూ.60 వరకు పెంచగా, తెలంగాణలో కేవలం రూ.28 మాత్రమే పెంచడం పట్ల కూలీలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో ఎనిమిది గంటల పాటు పని చేస్తే కూలి రూ.300 మాత్రమే గిట్టుబాటు కావడం తమను చిన్నచూపు చూడడమేనని కూలీలు పేర్కొంటున్నారు. కరువు పరిస్థితుల నేపథ్యంలో ఎలాంటి ఉపాధి లభించక ఇబ్బందులు పడుతున్న దినసరి కూలీల కోసం 2005లో అప్పటి కేంద్ర ప్రభుత్వం జాతీయ ఉపాధి హామీ పథకాన్ని ప్రారంభించింది. ఈ పథకంలో భాగంగా పనులకు హాజరయ్యే కూలీలకు సౌకర్యాలు కల్పిస్తూ, వారం వారం వారి బ్యాంకు ఖాతాల్లో కూలి డబ్బులు జమయ్యేవి. 2014 వరకు ఈ పథకం ద్వారా కూలీలకు నిత్యం ఉపాధి లభించేది. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ పథకంపై నిర్లక్ష్యపు జాడ్యం ఆవహించింది. గతంలో కూలీలకు కల్పించిన సౌకర్యాలు, చేయాల్సిన పనుల్లో కూడా కోత పెట్టింది. నెలల తరబడి కూలీల ఖాతాల్లో డబ్బులు జమ చేయడం లేదు. తమకు అనుకూలంగా ఉండే రాష్ట్రాల్లో గిట్టుబాటు అయ్యేలా కూలి పెంచుతూ, ఇతర చోట్ల మాత్రం నామమాత్రంగా వేతన పెంపును అమలు చేస్తున్నదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గతంలో సుమారు 40కి పైగా వివిధ రకాల పనులు చేసేలా ఉపాధి కూలీలకు వెసులుబాటు కల్పించింది. ప్రస్తుతం కేవలం 14 పనులు మాత్రమే చేసేలా ఉత్తర్వులు విడుదల చేసింది. గత ఆర్థిక సంవత్సరం నుంచి వాటినే అమలు చేస్తున్నారు. అలాగే, నిబంధనలు కూడా సమూలంగా మార్చి, ఈ ఆర్థిక సంవత్సరం నుంచి పని చేస్తున్న చోట రోజుకు రెండు సార్లు ఫొటో దిగి ఎన్ఎంఎంఎస్ యాప్ ద్వారా ఫీల్డ్ అసిస్టెంట్ ఫొటోలు అప్‌లోడ్ చేయడం తప్పనిసరి అయింది. ఇప్పటికే జాబ్‌కార్డుకు ఆధార్ అనుసంధానం చేయగా, అనేక మంది కూలీల కార్డులు లింక్ కాకపోగా, వారి ఖాతాల్లో కూలి డబ్బులు జమకావడం లేదు. ఆధార్ అనుసంధానం కాని కూలీల హాజరు కూడా పడడం లేదు. దీంతో జిల్లాలోని అనేక మంది ఉపాధి పనులకు దూరమవుతున్నారు. జిల్లాలో గతేడాది లక్ష్యం 28.30 లక్షల పనిదినాలు కల్పించాల్సి ఉండగా, ఇప్పటి వరకు కేవలం 20 లక్షల పని దినాలు మాత్రమే కూలీలకు కల్పించినట్లు తెలిసింది. 1,22,988 కుటుంబాలకు జాబ్‌కార్డులుండగా, కేవలం ఏడు వేల కుటుంబాలకు మాత్రమే వంద రోజుల పాటు పని కల్పించినట్లు అధికారులు వెల్లడించిన గణాంకాల ద్వారా స్పష్టమవుతున్నది. జిల్లాలో ఉపాధి కూలీల సంఖ్య రోజురోజుకూ గణనీయంగా తగ్గుతున్నట్లు అధికారుల లెక్కలు వెల్లడిస్తున్నాయి.

కవితలు, పాటలతో సమాజంపై బలమైన ముద్ర

- పెద్దపల్లి జిల్లా అదనపు కలెక్టర్ జీవీ శ్యామ్ ప్రసాద్ లాల్

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న శ్యాంప్రసాద్‌లాల్ తదితరులు

కమాన్‌చౌరస్తా, మార్చి 31: కవితలు, పాటలు సమాజంపై బలమైన ముద్ర వేస్తాయని, ఈ విషయంలో కవులు, గాయకుల పాత్ర సమాజంపై ఎంతో ఉన్నదని పెద్దపల్లి జిల్లా అదనపు కలెక్టర్ జీవీ శ్యామ్ ప్రసాద్ లాల్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని వాగేశ్వరి డిగ్రీ కళాశాలలో భవానీ సాహిత్య వేదిక ఆధ్వర్యంలో వైరాగ్యం ప్రభాకర్ అధ్యక్షతన ఆదివారం అంగన్‌వాడీ హుజూరాబాద్ ప్రాజెక్ట్ పర్యవేక్షకురాలు కోరుకంటి (మెన్నేని) కిరణ్మయి రచించిన 'నీ రాక కోసం' పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. జిల్లాలో సాహితీ రంగాన్ని పరిపుష్టం చేస్తూ కవులు ఎన్నో పుస్తకాలు వెలువరిస్తున్నారని, ఇది శుభపరిణామమని అన్నారు. అలాగే, వైరాగ్యం ప్రభాకర్ సంపాదకత్వంలో వెలువడిన అంకితం కథల సంకలనాన్ని బాల సాహిత్య పురస్కార గ్రహీత డాక్టర్ దాసరి వెంకటరమణ ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ శాఖ ఎఫ్ఏసీ సరస్వతి, దాస్యం సేనాధిపతి, మాడిశెట్టి గోపాల్, కాసు మహేందర్ రాజు, గాజోజు నాగభూషణం, బొమ్మకంటి కిషన్, గంప ఉమాపతి, సంపత్ కుమార్, నగునూరి రాజన్న, ఇటిక్యాల రాము, దామరకుంట శంకరయ్య, తడిగొప్పుల కుమార స్వామి, ఐల్నేని కేశవరావు, విజయలక్ష్మి, కోరుకంటి ప్రభావతి, ఉమేశ్వరరావు, భాస్కరరావు, సింగిరెడ్డి రాజిరెడ్డి, పెనుగొండ సరసిజ, బసవేశ్వర్, పత్తెం వసంత, సిరిపురం వాణిశ్రీ, వడ్డెపల్లి సంధ్య తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

గంగాధర, మార్చి 31: మండలంలోని ఉప్పరమల్యాలలో ఆదివారం కరీంనగర్ మెడికవర్ దవాఖాన ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామస్తులకు బీపీ, షుగర్ పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. చికిత్స అవసరం ఉన్న వారిని దవాఖానకు రెఫర్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ముద్దం నగేశ్, ఆళ్ల గోపాల్‌రెడ్డి, ఆళ్ల విజేందర్‌రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

'ఉపాధి' కూలి పెంచాలి

తెలంగాణచౌక్, మార్చి 31: ఉపాధి హామీ కూలీలకు కూలి రూ. 600కు పెంచాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కొయ్యడ సృజన్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. కూలి రూ. 28 పెంచుతూ తీసుకున్న నిర్ణయంతో కూలీలకు ఒరిగేదేమీ లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ కూలీలకు పెట్టిన నిబంధనలను తొలగించాలన్నారు.

చలివేంద్రం ప్రారంభం

తెలంగాణచౌక్, మార్చి 31: కమాన్ సమీపంలో జిల్లా వోపా కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆదివారం వోపా గౌరవాధ్యక్షుడు వేములవాడ ద్రోణాచారి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వేసవిలో ప్రజల దాహం తీర్చేందుకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు విష్ణువర్ధన్, హరిహరాచారి, చంద్రమౌళి, శివప్రసాద్, భీష్మాచారి పాల్గొన్నారు.

'కోడ్' ఉల్లంఘిస్తే ఫిర్యాదు చేయాలి

- 'సీ-విజిల్' యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలి
- రాజన్న సిరిసిల్ల జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అనురాగ్ జయంతి

కలెక్టర్ అనురాగ్ జయంతి

కలెక్టరేట్, మార్చి 31: ఎవరైనా ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే ప్రజలు వెంటనే సీ-విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేయాలని రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి అనురాగ్ జయంతి ఆదివారం ఒక ప్రకటనలో సూచించారు. ఓటర్లను మభ్యపెట్టేందుకు ఎవరైనా అక్రమంగా నగదు, మద్యం, ఇతర వస్తువులను పంపిణీ చేయడం, ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించడం వంటి చర్యలను ప్రజలు గుర్తిస్తే లైవ్ ఫొటోలు, వీడియోలను తీసి సీ-విజిల్ యాప్ ద్వారా పంపాలని తెలిపారు. సీ-విజిల్ యాప్ ద్వారా అందిన ఫిర్యాదులపై వంద నిమిషాల్లో బాధ్యులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. సభలు, సమావేశాల్లో విద్వేషపూరిత కామెంట్స్ చేసినా, పార్టీ అభ్యర్థులు డబ్బులు, మద్యం, బహుమతులు పంచినా, అనుమతి లేకుండా ర్యాలీలు నిర్వహించినా ఫిర్యాదు చేయాలని సూచించారు. సీ-విజిల్ యాప్‌ను తమ ప్లేస్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకొని ఎన్నికల కోడ్ ఉల్లంఘనలను తమ దృష్టికి తీసుకురావాలన్నారు. టోల్‌ఫ్రీ నంబర్ 1950 ద్వారా ఫిర్యాదు చేయవచ్చని, 24 గంటలు కలెక్టరేట్‌లో సీ-విజిల్ యాప్ ఫిర్యాదులపై పర్యవేక్షణ జరుగుతుందన్నారు. ఫిర్యాదు చేసిన వారి పేర్లు, సెల్ నంబర్లను గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

రైతుల సమస్యలు పరిష్కరించాలి

- ఎండిన పంటలకు రూ.30 వేల చొప్పున పరిహారం ఇవ్వాలి
- కేంద్ర ప్రభుత్వ నిరంకుశ విధానాలపై నిరసన కార్యక్రమాల్లో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలి
- సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి

మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి

హుజూరాబాద్ టౌన్, మార్చి 31: రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించి, వారిని ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఆదివారం హుజూరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, రాష్ట్రంలో నీళ్లు అందక వేలాది ఎకరాల్లో వరి పంట ఎండిపోయిందని, ఎకరాకు రూ.30 వేల చొప్పున రైతులకు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. యాసంగి సీజన్‌కు సంబంధించి 'రైతుబంధు' పెట్టుబడి సాయం ఇంకా పూర్తిగా విడుదల కాలేదని, రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేయాలన్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కౌలు రైతులకు కూడా రైతుబంధు ఇవ్వాలని కోరారు. రూ.2 లక్షల రైతు రుణమాఫీకి వెంటనే నిధులు కేటాయించాలని, స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం కొత్త రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ కార్మికులు, విద్యుత్ శాఖలో పనిచేస్తున్న ఆర్టిజన్స్‌ను రెగ్యులర్ చేయాలన్నారు. కల్యాణ లక్ష్మి లబ్ధిదారులకు వెంటనే చెక్కులు అందజేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం సీబీఐ, ఈడీ, ఐటీ లాంటి సంస్థలను తమ జేబు సంస్థలుగా వాడుకుంటున్నదని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ నిరంకుశ విధానాలపై ఈ నెల 1 నుంచి 15 వరకు కొనసాగే నిరసన కార్యక్రమాల్లో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాలని, రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ఆ పార్టీ అభ్యర్థులను ఓడించాలని సీపీఎం శ్రేణులు, ప్రజలకు పిలుపునిచ్చారు. సమావేశంలో పార్టీ జోన్ కార్యదర్శి వెలమారెడ్డి రాజిరెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు శీలం అశోక్, జోన్ కమిటీ సభ్యుడు గుండేటి వాసుదేవ్ పాల్గొన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం

వేదికపై నాటి గురువులతో పూర్వ విద్యార్థులు

ముస్తాబాద్, మార్చి 31: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదివిన విద్యార్థులు (1979-80లో ఎస్సెస్సీ) ఆదివారం పాఠశాలలో అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. దశాబ్దాల తర్వాత ఒక్క చోట కలుసుకున్న మిత్రులంతా.. ఒకరినొకరు యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకొని సరదాగా గడిపారు. నాడు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను సన్మానించారు. ఇక్కడ ముస్తాబాద్ బాలికల పాఠశాల హెచ్ఎం రవీందర్, రిటైర్డ్ ఎంఈవో పరశురాములుగౌడ్, నాటి వ్యాయామ ఉపాధ్యాయుడు మోహన్‌రెడ్డి, అటెండర్ రాములు, సిబ్బంది ఉన్నారు.

రైతులను కడుపులో పెట్టుకొని కాపాడుకుంటాం

గంగాధర, మార్చి 31: చొప్పదండి నియోజకవర్గంలోని రైతులను కడుపులో పెట్టుకొని కాపాడుకుంటామని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రామడుగు మండలం గాయత్రీ పంపుహౌస్ నుంచి వరదకాల్వకు నీటిని విడుదల చేయించినట్లు తెలిపారు. గాయత్రీ పంపుహౌస్ వద్ద నీటి విడుదలకు కరెంటు సమస్య ఏర్పడగా, పరిష్కరించి వరద కాల్వకు నీటిని విడుదల చేయించినట్లు పేర్కొన్నారు. వరద కాల్వకు నీటి విడుదలకు సహకరించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి రైతుల పక్షాన కృతజ్ఞతలు తెలిపారు.

సుడా చైర్మన్‌కు సత్కారం

నరేందర్‌రెడ్డిని సన్మానిస్తున్న శాతవాహన వాకర్స్ అసోసియేషన్ బాధ్యులు

రాంనగర్, మార్చి 31: నగరంలోని శాతవాహన యూనివర్సిటీలో సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డిని ఆదివారం శాతవాహన వాకర్స్ అసోసియేషన్ సభ్యులు సన్మానించారు. అసోసియేషన్ బాధ్యులు ధర్మారం వెంకటస్వామి, పెరుక రాజేందర్, నర్సయ్య, శ్యామ్ ప్రసాద్, పోచయ్య పటేల్, మోహనాచారి, కనకా చారి, అంజన్ కుమార్, దశరథం తదితరులు పాల్గొన్నారు.

ఆర్మీ జవాన్ రామకృష్ణ మృతికి నివాళి

సైదాపూర్, మార్చి31: గొడిశాల గ్రామానికి చెందిన ఆర్మీ జవాన్ నెల్లి రామకృష్ణ శనివారం తెల్లవారుజామున మృతిచెందగా, ఆదివారం ఆయన అంత్యక్రియలు స్వగ్రామంలో జరిగాయి. ముందుగా ఆర్మీ అధికారులు జవాన్ మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించగా, గ్రామంలో అంతిమయాత్ర నిర్వహించారు. రామకృష్ణ మృతదేహాన్ని కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ సందర్శించి, నివాళులర్పించారు. కుటుంబసభ్యులను ఓదార్చారు. అలాగే ఎస్ఐ ఆరోగ్యం ఆధ్వర్యంలో పోలీసులు జవాన్ మృతదేహానికి నివాళులర్పించారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు దొంత సుధాకర్, మాజీ సర్పంచులు పోగు రమేశ్, జున్నూతుల రాజిరెడ్డి, సింగిల్‌విండో మాజీ చైర్మన్ జున్నూతుల భాస్కర్‌రెడ్డి, సింగిల్‌విండో డైరెక్టర్ బొమ్మగాని రాజు నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

వసతి గృహాల్లో వసతులు కల్పించాలి

తెలంగాణచౌక్, మార్చి 31: ప్రభుత్వ వసతి గృహాల్లో మౌలిక వసతులు కల్పించాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శనిగరం రజినీకాంత్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నగరంలో శివాని డిగ్రీ కళాశాలలో ఆదివారం నిర్వహించిన సంఘం నగర మహాసభలో ఆయన మాట్లాడారు. హాస్టళ్ల మెస్‌చార్జీలను పెంచాలన్నారు. అనంతరం నగర కమిటీని ఎన్నుకున్నారు. నగర అధ్యక్షుడిగా ఈశాక్, కార్యదర్శిగా వినయ్‌తోపాటు 16 మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. సమావేశంలో సంఘం నాయకులు అరవింద్, గజ్జెల శ్రీకాంత్, శివమణి, రాకేశ్ పాల్గొన్నారు.

ఎస్ఎంఎఫ్‌సీసీని కలిసిన మైనారిటీ నాయకులు

కలెక్టరేట్, మార్చి 31: రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ దీపక్ జాన్‌ను హైదరాబాద్‌లోని నివాసంలో జిల్లా క్రిస్టియన్ మైనారిటీ నాయకులు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. సత్కరించి, పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఇక్కడ జిల్లా క్రిస్టియన్ మైనారిటీ నాయకులు జాన్ వెస్లీ, దినకర్, యేసుపాదం, ఇమ్మాన్యుయేల్ తదితరులున్నారు.

మిత్రుల ఔదార్యం

బాధిత కుటుంబసభ్యులకు నగదు అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

గంగాధర, మార్చి 31: గంగాధర జడ్పీ ఉన్నత పాఠశాలలో 2003-04 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన ఇద్దరు విద్యార్థినుల భర్తలు ఇటీవల మృతిచెందారు. ఆర్థికంగా ఇబ్బందులు పడుతుండగా, విషయం తెలుసుకున్న తోటి మిత్రులు ఆదివారం వారి కుటుంబాలను పరామర్శించారు. ఒక్కొక్కరికీ రూ.25 వేల చొప్పున నగదు, నెలకు సరిపడా సరుకులు అందజేశారు. ఇక్కడ పూర్వ విద్యార్థులు రమేశ్, సురేశ్, రమేశ్, ప్రేమ్‌కుమార్, సంగీత, మమత, మంజుల, లతపుష్ప, గంగాప్రసాద్ తదితరులున్నారు.

నలుగురిపై కేసు

గన్నేరువరం, మార్చి 31: మండలంలోని మాదాపూర్ గ్రామంలో ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన నలుగురు బీజేపీ నాయకులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నరేశ్ తెలిపారు. గ్రామంలో ఈజీఎస్ పథకం కింద మంజూరైన సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆదివారం కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ విషయం అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి కిరణ్ గుర్తించి ఫ్లయింగ్ స్క్వాడ్‌కు సమాచారం ఇచ్చారు. ఎంసీసీ శంకర్, ఫ్లయింగ్ స్క్వాడ్ ఇన్‌చార్జ్ రాజశేఖర్ గ్రామానికి వెళ్లి సంబంధిత ప్రదేశాన్ని పరిశీలించారు. ఈ పనులను బీజేపీ నాయకులు బండి తిరుపతి, కాంతాల రాజిరెడ్డి, మాడుగుల రామకృష్ణారెడ్డి, గంగాధర శ్రీకాంత్ ప్రారంభించినట్లు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

'స్వర్ణ నంది' అవార్డు ప్రదానం

వేములవాడ టౌన్, మార్చి 31: లంబోదర కల్చరల్ అకాడమీ, మై వేములవాడ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రాజన్న సన్నిధిలోని కళాభవన్‌లో ఆదివారం నిర్వహించిన ఓ కార్యక్రమంలో పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యుడు ఆనందరెడ్డికి జాతీయస్థాయి ఉగాది స్వర్ణనంది అవార్డు ప్రదానం చేశారు. ఆనందరెడ్డి సేవలకు గుర్తింపుగా అవార్డును అందించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు అభినందించారు. ఈ సందర్భంగా కళాభవన్‌లో నిర్వహించిన నేషనల్ లెవల్ మ్యూజిక్, డ్యాన్స్ ఫెస్టివల్‌లో చిన్నారులు పాల్గొని సందడి చేశారు. కార్యక్రమంలో మై వేములవాడ చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకుడు మధు మహేశ్, ఘంటసాల పవన్‌కుమార్, రాజస్వరూప్, తాడి రమేశ్, రాజారాం, ఏర్పుల శ్రీనివాస్, రేవతి ప్రసాద్, రాజ్‌కుమార్, తులసి, ప్రసాద్, సగ్గు రాహుల్, పాత సంతోష్, ప్రతాప నటరాజ్, పసుల శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యే సం